కథానిక




# విరహోత్కంఠిత

ఉదయం పది గంటలు. బ్యాంక్ క్యాష్ కౌంటరు ముందు కూర్చుని డబ్బు లెక్కపెడ్తూ యమ బిజీగా వున్నాడు చంద్రం. ఆ ముందు రోజు సెలవు రోజు కావడంతో బ్యాంక్‌లో చాలా రద్దీగా వుంది. కౌంటరు ముందు పెద్ద చేంతాడంత క్యూ. అందరి మొహాల్లోనూ పని త్వరగా తెములుచ్చుకుని వెళ్ళిపోవాలన్న ఆతృత.

సరిగ్గా అలాంటి సమయంలో "ఇదుగో సార్ మీకు పర్సనల్ టపా..." అంటూ ఒక కవరు తెచ్చిచ్చాడు ప్యూన్ రంగనాథం.

అలవాటైన పనిని చకచక కానిస్తూనే ఆ కవరు వైపు చూసాడు.

అపరిచితమైన దస్తూరి. గుండ్రటి అక్షరాలు. అది ఒక ఆడపిల్ల చేతి వ్రాత అని గ్రహించేసరికి మనసు ఆనందంతో గతి తప్పింది. తను కోరుకున్న ఉత్తరం. వారం రోజులుగా ఎదురు చూస్తున్న లేఖ రానే వచ్చేసింది.

మనస్సులోనే "హుర్రే..." అని పట్టలేని సంతోషంతో అరిచాడు.

ఆ ఉత్తరాన్ని హృదయానికి హత్తుకోమని మనసు తొందర చేస్తుంది. పని ఒత్తిడి తగ్గేవరకూ ఓపిక పట్టాలి తప్పదు. డబ్బుతో వ్యవహారం. లెక్కల్లో ఏ కాస్త తేడా వచ్చినా తిరిగి తన తల మీదకే వస్తుంది. అని తనని తాను నిగ్రహించుకున్నాడు.

అయినా యాంత్రికంగా చేతులు తన పనిని చేస్తుంటే మనసు వెనక్కి తిరగి వారం రోజుల క్రితం జరిగిన పెళ్ళి చూపుల దగ్గరికి వెళ్ళి నిలిచింది.

ఆనాడు సుకుమారంగా నడిచి వచ్చి ఎదురుగా కూర్చుంది దివ్య. పేరుకు తగ్గట్టుగా ముగ్ధమనోహరంగా వున్న రూపం. ప్రథమ వీక్షణంలోనే ఈమె కోసమే తనిన్నాళ్ళు వేచి వున్నాడనిపించింది.

"నీ పేరేమిటమ్మా?.." అమ్మ కావాలనే ప్రశ్న వేసింది.

"దివ్య." కోకిల కంఠం. తీయగా రాగం తీసినంత మృదువుగా పలికింది. అంతకు మించి అమ్మాయిని ఎక్కువ ప్రశ్నలు వేసి వేధించటం తగదని ఇంటి నుండి బయలు దేరకముందే తల్లికి, చెల్లికి చెప్పాడు. అతను రచయిత. అతనికి కొన్ని ఆదర్శాలు, ఆలోచనలు వున్నాయి.

"ఏమంటావురా అబ్బాయి?" అన్నట్టుగా తన వైపు చూసింది అమ్మ.

తను చెల్లివైపు చూశాడు. ఆమె మొహం నిండా వెన్నెల లాటి నవ్వు నింపుకుని "ఒప్పకోరా?" అన్నట్టు సైగ చేసింది. తను చిన్నగా నవ్వి సరే నన్నట్టుగా తల ఊపాడు.

"అమ్మా! నేను ఒక అయిదు నిమిషాలు ఆ అమ్మాయితో ఒంటరిగా మాట్లాడాలి" నెమ్మదైన కంఠంతో తల్లిని అడిగాడు.

అతనలా అడిగాడంటే అది ఖచ్చితంగా జరిగి తీరాలని తల్లికి తెలుసు.

అతని కోరికని తల్లి వారికి తెలిపింది.

కొద్దిసేపు అవతలి వారు వారిలో వారు చర్చించుకుని చివరికి "సరే..." అన్నారు.

"ఒంటరిగా అంటే, అమ్మాయిని మీతో బయటకి పంపము. అది మా సంప్రదాయం కాదు. అయితే రోజులు మారాయి కాబట్టి నీ మాట వినాల్సిందే... మా పెరట్లో మామిడి చెట్టు క్రింద దివ్య వుంది. వెళ్ళి మాట్లాడు బాబు!" అని చెప్పి "వెళ్ళరా! అతనికి ఇల్లు చూపించు" అని మనవడికి పురమాయించింది దివ్య బామ్మగారు.

వాడు తనకి కాబోయే బావమరిది కాబోలు. ఇల్లంతా తెగ తిప్పి తనతో పాటే పెరట్లోకి రాబోతుంటే...

"మాధవా!... ఒకసారి ఇటురారా!" అంటూ ఎంతో గడసరిగా మనవడిని పిలుచుకుంది బామ్మగారు.

తను ఒంటరిగా పెరట్లోకి అడుగుపెట్టాడు. అతనిలో ఒక రకమైన ఉద్విగ్నత, ఉత్సుకత. కొద్ది దూరంలో నీరెండలో. మామిడి చెట్టు నీడన నిలుచుని వుంది దివ్య.

పాల సముద్రంలోని తెలుపును, మందారంలోని ఎరుపునూ కలబోసినట్టుగా వున్న వంటి ఛాయ.

రామప్ప ప్రాంగణంలో నిలిచిన శిల్ప సుందరిని బిర్లావాడు మెచ్చి పాలరాతితో చెక్కిస్తే ఇలాగే వుంటుందేమో అనిపించే శరీర సౌష్టవం. ఆమె తన ఆగమనాన్ని క్రీగంట గమనించి సిగ్గుతో వైదొలిగి అటు తిరిగింది.

ఆ తిరగటంలో కృష్ణవేణి తరంగంలా, భుజాల మీద నుండి జారి నడుమును దాటి పిరుదులని ముద్దాడుతూ కదిలిన నల్లని వాలు జడ.

ఆ జెడ నిండా తెల్లనైన, స్వచ్ఛమైన నవ వధువు లాంటి మల్లెలు. నెమ్మదిగా నడచి వచ్చి ఆమెకి అభిముఖంగా నిలబడ్డాడు.

తన జీవితంలోకి ఆహ్వానించబోయే అమ్మాయితో

## సాకేతపురి కస్తూరి

మొదటిసారి మాట్లాడాలంటే కలిగే సహజమైన తత్తరపాటు.

అయిదు నిమిషాల వ్యవధిలో ఆమె మనసు తెలుసుకోలేకపోయినా, ఆమెకు తను నచ్చాడో లేదో అన్నది ఆ నోట వినాలన్న ఆతృతతో-

"నేను నచ్చానా దివ్యా?" తడారిపోతున్న కంఠంతో చిన్నగా అడిగాడు.

కళ్ళెత్తి అతని వైపు చూడడానికి బిడియ పడుతూ తలని ఊపింది.

"తల ఊపటం కాదు. ఇటు చూడూ! పెదవి విప్పి చెప్పాలి". అన్నాడు.

ఒకటి రెండు మూడు నిమిషాలు గడిచాయి.

"చెప్ప దివ్యా!"


ఆమె తల ఎత్తి ఏదో చెప్పబోయింది. ఇంతలో "దివ్యా లోపలికి రామ్మా?" అన్న బామ్మగారి పిలుపు.

తను ఆమెతో ఏమీ మాట్లాడగలిగాడని అప్పడే పిలుస్తున్నారు. చికాకుతో పాటుగా ఉక్రోషం ముంచుకుని వచ్చింది.

అక్కడి నుండి పోబోయివ దివ్యతో "ప్లీజ్ దివ్యా! ఉత్తరం వ్రాయి. కనీసం ఉత్తరంలోనైనా నీ మనసు తెలుపు" ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

దివ్య ఒక్కసారి తల తిప్పిచూసి సరేనన్నట్టుగా తల పంకించి వెళ్ళిపోయింది.

ఆ ఒక్క చూపే చాలు గుండెలో శతకోటి ఆశాదీపాలను వెలిగించి ఆమె ఉత్తరం కోసం నిరీక్షించేలా చేసింది. చంద్ర తన ఆలోచనలలో నుండి బయటపడి జేబులోని ఉత్తరాన్ని ఆప్యాయంగా తడుముతూ చుట్టూ చూసాడు. జనం పలచబడ్డారు. కౌంటరులో మరో క్యాషియర్ వున్నాడు. అతన్ని మిగతా పని మ్యానేజీ చేసుకోమని చెప్పి కుర్చీలో వెనక్కి వాలి కవరు విప్పాడు చంద్ర.




గులాబీ రంగు కాగితం ముత్యాల సరాల్లా అక్షరాలు. ఆ అక్షరాల వెంబడి అతని కళ్ళు ఆత్రంగా పరుగులెత్తాయి.

ఏమని పిలవను?

ప్రియతమా అననా!... నా ప్రాణమా!. జన్మ జన్మల అనుబంధమా అననా? ఆ రోజు సాయంత్రం మీరు వెళ్ళిపోయారు. పోతూ పోతూ.. ఇక్కడ ఏ సమ్మోహ అస్త్రాన్ని సంధించి వెళ్ళారో.. ఏ అందమైన రహస్యాన్ని విప్పి నా పరువానికి జత చేసి వెళ్ళారో కాని, వెలుతురు రేఖలా నా గుండెలో జొరబడి నా చుట్టూ వున్న ప్రపంచాన్నంతా ఆక్రమించేశారు. నిన్నటికి నిన్న ఎదనిండా మీ ఊహల బరువుతో అన్యమనస్కంగా వున్నానేమో! వదిన ఎంత పిలిచినా పలకలేదట.

ఇంట్లో బామ్మ దగ్గరి నుండీ అంతా వేళాకోళమే. వాళ్ళ గోల భరించలేక డాబా మీదకెళ్ళాను.

గుండె నిండుగా ఏదో ఆనందం. ఆ వెను వెంటనే మీ ఎడబాటు కలిగించిన విషాదం.

నాలోని విచిత్రావస్థని చూసిందేమో! ఓ చల్లని. గాలి తెమ్మెర నన్ను ఓదారుస్తున్నట్టుగా వీచింది.

నాలోని తాపాన్ని చల్లార్చటానికా అన్నట్టు ఆషాడ మేఘాలు కదిలి వచ్చేసాయి. ఆ మేఘం కురిపించిన జల్లులకి పులకరించిపోతూ అనుకోకుండా మామిడి చెట్టు వైపుకి చూసాను. అంతా నా భ్రమ. కాకపోతే, అక్కడ మీరు ఇంకా ఎందుకు వుంటారు? అయితే నా చూపులని పసికట్టిందేమో! మామిడి రెమ్మ ముసి ముసిగా నవ్వుతూ పక్కనే వున్న దానిమ్మమొగ్గకేమో చెప్పింది. అదేమో! ఎరుపెక్కిన మోముతో నన్ను చూసి పకాలుమని

నవ్వింది. చూసారా! వాటి కొంటెతనం. మనం వాటి నీడన నిలబడి మాట్లాడుకోవటంతోనే కదా! వాటికా మిడిసిపాటు.

అయినా వాటికేమి తెలుసు! కోటి కోరికలు నింపుకున్న కొత్త పెళ్ళి కూతురి బాధ.

అది చదువుతున్న చంద్రం గుండె దడ హెచ్చింది. ముద్ద బంతి పూవులా అమాయకంగా కనిపించిన దివ్యలో ఇన్ని ఆలోచనలు దాక్కుని వున్నాయా?... అని అబ్బురపడి పోయాడు. అతని కళ్ళు సంభ్రమంగా అక్షరాలని అతుక్కుని పోయాయి.

అంతేనా ఇవన్నీ చాలవన్నట్టు మబ్బుల చాటు నుండి తొంగి చూసిన చంద్రుడు తన వెన్నెల వేడితో నన్ను అల్లరి పెడుతుంటే విసిగి పోయి నా గదిలోకి వచ్చాను. గదిలోకి రాగానే ఎదురుగా తిలక్‌గారి అమృతం కురిసిన రాత్రి.

నా గది స్వప్నాలతో నిండిపోయింది
నా మది స్వగతాలతో కుంగిపోతోంది
ఇంక రావెందుకు ప్రభూ
శంకాకులమై ఈ రాత్రి సడలిపోతోంది
ఇదుగో ఇది చదివారా?

అవధరించవెందుకు పరిపక్వమైన నా యౌవన విన్నపాన్ని

నవధరించవెందుకు అసకృదతిశయోక్తికి శిలమైన నా తనూ కావ్యాన్ని

జాగు సేయకు ప్రభూ–కడ

జామువచ్చెనా తన వెలుగు పారెనా – నిష్ఫల మివన్నీ

అబ్బా!.. ఆపదల్లో ఉన్న రమ్యత ఆ భావాల్లోని లాలిత్యమూ అనుభూతిస్తుంటే మీరు నా ప్రక్కన లేరన్న బాధ వెయ్యింతలై పోతుంది.

అసలు మన మొదటి రేయి. ఈ పుస్తకాన్ని మీకు బహుమతిగా ఇద్దామనుకున్నాను. కాని ఆ రోజు నేను గదిలోకి వచ్చి.. రాగానే మీ...తొందర. అదీ..

చదువుతున్న చంద్రం చేతులు వణికాయి. ఏదో తెలియని భయంతో ముచ్చెమటలు పోసాయి.

మొదటి రేయి? మొదటి రేయి? ఏమిటది? తనకీ దివ్యకి ఇంకా పెళ్ళి కూడా నిశ్చయం కాలేదు. ఇంతకీ ఇది దివ్య వ్రాసిన ఉత్తర మేనా! ఆకస్మికంగా అనుమానం వచ్చింది. చంద్ర మిగతా అక్షరాలని దాటేస్తూ చివరన చూసాడు.

మీ జీవన ప్రణయిని
మాధవి

అది చదివిన అతని గుండె ఒక్కసారి గుబిల్లుమంది. ఎవరీ మాధవి? ఎవరికి వ్రాసిందీ ప్రణయలేఖ? అతను క్రింద పడేసిన కవరునందుకుని అడ్రసు చూసాడు. ఎస్. చంద్ర ఆఫీసర్ అని వుంది.

అతని గుండె అది చదివి ఒక్క క్షణం ఆగిపోయి నట్టుగా తోచింది. ఈ ఉత్తరం ఎస్. చంద్రశేఖర్‌ది. అతనికి కొత్తగా పెళ్ళి అయ్యింది. సముద్రంలా వున్న ఆ బ్యాంకులో చంద్రలు, రమణలు, రావులు చాలా మందే వున్నారు.

ఈ పేరు గలవాళ్ళకి కొండొక గుర్తులు పెట్టి పిలుచుకోవటం పరిపాటి. ఈ సెక్షన్‌లో వున్న తన పేర్శు చంద్రమోహన్. తన పేరులోని మోహన్



## సీక్రేట్ లాంగ్వేజి

అనుమానపు మొగుళ్ళు ఆత్మహత్య చేసుకునే స్పాట్ గురించి మీకు తెలుసా? నేపాల్‌లోని జీర్సో అడవుల్లో నివశించే ఆదివాసి తెగలోని మహి ళలకు వాళ్ళకంటూ ఓ ప్రత్యేక భాష వుంది. భర్తలకూ వో భాష వుంది. భర్తల భాష భార్యలకు ఈజీగానే అర్థం అవుతుంది. భార్యల భాషమాత్రం భర్తలకు తెలీనే తెలీదట. 3 వేల ఏళ్ళుగా ఈ సంప్రదాయం ఇలానే కొనసా గుతోంది. ప్రపంచంలోనే అరుదైన భాషాత్మక వింత ఇది.

కట్ చేసి 'చంద్రా' అనటం అలవాటు.అలాగే చంద్రశేఖర్ పేరులోంచి చంద్రాని అవసరార్థం తొల గించి 'శేఖర్' అంటూ వుంటారు. ఇంటి పేర్లు ఎస్ కావటం కాకతాళీయకం.

ఆమె అడ్రసులో చంద్ర అని వ్రాయటంతో ఈ చిక్కు వచ్చి పడింది. అయినా తనదీ తప్పే. ఏదో లోకాన విహరిస్తూ అక్కడ అడ్రసులో క్లియర్‌గా ఆఫీసర్ అని వున్నదీ చూసుకోలేదు" అని తనని తాను తిట్టుకున్నాడు.

అసలు విషయం గ్రహించాక నెత్తిన ఐసుముక్క పెట్టుకున్నట్టుగా చల్లపడిపోయాడు. రెండు నిమి షాల సేపు అతనికి కాళ్ళూ చేతులూ ఆడనట్టుగా అలాగే కూర్చుండిపోయాడు.

తరువాత నెమ్మదిగా ఆ కవరుని చేతిలోకి తీసుకుని చూసాడు. నయం దానిని అస్తవ్యస్తంగా చింపలేదు. అతను జాగ్రత్తగా ఆ కాగితాలని మడిచి కవరలో పెట్టి గుర్తించకుండా అతికించాడు.

నెమ్మదగా శేఖర్ టేబిల్ దగ్గరకి వెళ్ళి "సార్! ఇది మీ ఉత్తరం.. పొరపాటున రంగనాథం నాకిచ్చాడు." అంటూ ఆ కవరుని అందించాడు.

శేఖర ఆ కవర్‌ని అందుకుని చూసీ చూడకుండా టేబిల్ సొరుగోలో పడేసాడు.

అది చూసి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు చంద్ర. కాని తప్ప చేశానన్న భావం. గిల్టీనెస్ అతన్ని ఆరో జంతా వెంటాడింది.

దానికి తోడు ఎంత వద్దనుకున్నా అందమైన ఆ ప్రేమలేఖ గుర్తుకి వస్తూనే వుంది. అసలే భావకుడు అయిన అతన్ని కలవర పరుస్తూనే వుంది. ఆ రాత్రి చంద్రం కళ్ళు మూసినా తెరిచినా రమణీయమైన ఆ లేఖలోని భావుకత్వం, రసానుభూతి వెంటాడుతూనే వుంది.

డాబా మీద చిరు జల్లులో తడుస్తూ ప్రియుడి కోసం ఎదురు తెన్నులు చూస్తున్న అభిసారిక–

పడక మీద బోర్లా పడుకుని దిండును గుండెలకి అదుముకుంటూ విరహతాపాన్ని చల్లార్చుకోవాలని వ్యర్థ ప్రయత్నం చేస్తున్న విరహోత్కంఠిత.

మనసున మల్లెల సౌరభం నింపుకుని మేనికి మంచి గంధాన్ని అలముకుని కళ్ళలో కోర్కెల అగరొత్తులని వెలిగించుకుని ప్రియుడి కోసం సింగా రించుకుని కూర్చున్న వాసక సజ్జిక... కళ్ళ ముందు లీలా రూపంగా దర్శనమిస్తోంది.

పరాయి స్త్రీని గురించి యోచించటం తగదని ఎన్నిసార్లు మనసు సర్ది చెప్పినా హృదయాన్ని అలరించిన ఆ లేఖని మరవటం సాధ్యం కావటం లేదు.

"కొన్నాళ్ళకి తనకి పెళ్ళవుతుంది. దివ్యలోనూ ఇంతటి బావుకత్వం వుంటే .. తనంతటి అదృష్టవంతుడు ఈ పృథ్వి మీద వుండడు" అనుకున్నాడు.

ఆ మరునాటు నిద్రలేక ఎర్రపడిన కళ్ళతో బ్యాంక్‌కి వచ్చారు చంద్ర.

అతన్ని చూస్తూనే "చంద్రగారూ! ఇలా రండి" అంటూ పిలిచాడు శేఖర్. చంద్ర కాళ్ళు చల్లబడిపోయాయి. అతను ఆ ఉత్తరాన్ని తను చింపి చదివాడని గ్రహించి వుంటాడా?.. అన్న ఆలోచనతో గుండె జారిపోయింది. అతను భయపడుతూ శేఖర్ టేబిల్ దగ్గరికి వెళ్ళాడు.

చంద్రగారూ "మీకో ఇంట్రెస్టింగ్ న్యూస్" అన్నాడు.




శేఖర్ అతని చేతిలో నిన్నటి కవరుని చూసి తడారిన గొంతుతో–

"చెప్పండి..." అన్నాడు.

"మా మిసెస్ రచయిత్రి. ఆమె ఇక్కడికి వచ్చాక మీకు పరిచయం చేద్దామనుకున్నాను. కాని ఆమె రాకముందే ఆమెని గురించి తెలుసుకునే అవకాశం.. మీకు" తరువాత అతను ఏమంటున్నాడో కూడా వినిపించలేదు. తల గిర్రుమని తిరిగిపోయింది. 'అయిపోయింది ఈ రోజుతో బ్యాంకులో నా పరువు గోవిందా" చంద్ర ఆలోచిస్తుండగా.. "

"ఇదిగో ఇది చదవండి" అంటూ ఆ కవరునందించబోయాడు.

"సర్!?..." అర్థం కానట్టుగా చూసాడు చంద్ర.

"ఇది నా మిసెస్ వ్రాసిన కథలోని కాగితాలు. అవి మరిచిపోయి నాకు పోస్టు చేసినట్టుంది. ఇవి చూడండి" అని అతను అంటుంటే నిజంగా షాక్ తింటూ–

"అవి.... అవి మీరు చదివారా సర్?" అన్నాడు.

"ఏదో కొద్దిగా చదవటం కాదు. చదవటానికి ప్రయత్నించానంటే బాగుంటుంది. నాకు ఈ కథలూ అవి అంటే అసలు ఇంట్రస్టు లేదు. పైగా నేను తెలుగులో యమపూర్.." అతను ఎంతో తేలికగా చెప్తుంటే అతని వైపు జాలిగా చూసాడు చంద్ర.

నిన్నటి రోజంతా తనలో ఎంతో మాధుర్యాన్ని నింపి గుండెలో అలజడిని రేపిన ఆ కాగితాలు అతని చేతిలోపడి తమ విలువని కోల్పోయాయి.

## చమత్కారిక

పులి సింహం
క్రూర జంతువులా!
అయితే
గొర్రెమేక
'కూర' జంతువులు

* * *

– రసరాజు

అతను జీవితంలో ఎంత ఆనందాన్ని మిస్ చేసుకోబోతున్నాడో తెలిసి బాధ వేసింది.

"అది కథ కాదు స్వామి! మీ ఆవిడ నీకు వ్రాసిన ప్రణయలేఖ! అని చెప్పగల సాహసం చేయలేక ఆ కాగితాలని పట్టుకుని తన కౌంటర్‌లోకి వచ్చి కూర్చున్నాడు.

అప్పుడే రంగనాథం వచ్చి "సార్ మీకు టపా" అంటూ ఒక కవరు తెచ్చి యిచ్చాడు.

కవరు విప్పాడు. అది దివ్య నాన్నగారు వ్రాసిన ఉత్తరం. తనకి దివ్యకి పెళ్ళి ఖాయపరిచామని తమ ఆనందాన్ని ప్రకటిస్తూ వ్రాసారు.

ఆ కాగితంలోనే క్రిందుగా దివ్య నాలుగు వాక్యాలు వ్రాసింది.

అందులో సారాంశం. పూజ్యులైన అత్తగారు వచ్చి వెళ్ళారని, తన బి.ఎ: రిజల్ట్స్ వచ్చాయని, ఇంగ్లీషులో తక్కువ మార్కులు వచ్చాయని, టైపు క్లాసులకు వెళతున్నానని వ్రాసింది.

అది చదవిన చంద్రం మదిలోని స్వప్న సౌధం కూలిపోయింది. గుండె గదిలోని ఆశ అడియాసై రాలిపోయింది. అతని కళ్ళ ముందు తిలక్ విరహోత్కంఠిత

ఎన్ని సరదాల అగరు వత్తులు ఎలిగించుకున్నాను.
ఎంత కాంక్షా శ్రీ గంధమ్ముమైనలది కొన్నాను.

●

దేశ ప్రగతి గ్రామస్థాయి నుంచి మాత్రమే జరగాలి
-మహాత్మాగాంధి



గాంధీజీ భావస్ఫూర్తితో గ్రామస్థాయిలో ప్రకృతి అందాల మధ్య దశాబ్దాం క్రితం అంకురించిన 'మీ మినర్వా' నేడు 8 మండలాల్లో 78 గ్రామాలకు మరియు 5 జిల్లాల హాస్టల్ విద్యార్థులకు విద్యా సుగంధాన్ని అందిస్తూ దేశ స్వర్ణోత్సవ శుభాకాంక్షలతో....

**మినర్వా పబ్లిక్ స్కూల్**
(ఇంగ్లీష్ మీడియం)

**మినర్వా జూనియర్ కాలేజి**
(ఇంగ్లీష్ మరియు తెలుగు మీడియం)

**మినర్వా ఇన్‌ఫోటెక్ APEL**
(కంప్యూటర్ ఎడ్యుకేషన్ విభాగం)

ప్రత్తిపాడు-533 432, తూర్పు గోదావరి జిల్లా (ఆం.ప్ర)
ఫోన్స్ : (08868) 26462, 26562, 26662, 26762

Sarada Advtg. Services, Samalkot. ✆ (0884) 27964